క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మాకవరపాలెం: అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వైస్ ఎంపీపీ లక్ష్మి, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. ఐదో విడత వాహనమిత్ర నగదు జమ సందర్భంగా తామరం సచివాలయంలో శుక్రవారం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కోసూరు నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ రెండో వార్డు కోనా వసంతకుమారి ప్రసవం సమయంలో వెయిట్‌లాస్‌తో పుట్టిన పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారు. పిల్లలకు ఆపరేషన్ చేయించడంతో వైద్య ఖర్చు నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.20 లక్షల చెక్కును స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

కాలి నడకన విజయవాడకు పయనం


కాలినడకన విజయవాడ వెళ్తున్న భవానీ మాలధారణ భక్తులు

గొలుగొండ: మండల కేంద్రం నుంచి ఐదుగురు భవానీ మాలధారణభక్తులు కాలినడకన విజయవాడకు శుక్రవారం పయనమయ్యారు. గ్రామానికి చెందిన బొట్టా చంటి, నాగరాజు, అప్పలరాజు, లోవరాజు, బాలరాజు అక్కడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోనున్నారు. 12 రోజులు పాటు కాలినడన ప్రయాణం చేసి అమ్మవారిని దర్శించుకుని తిరిగి ఇంటికి చేరుకుంటామని వారు తెలిపారు.

8 నుంచి జిల్లా స్థాయి షటిల్ పోటీలు


ప్రత్యేకంగా తయారు చేస్తున్న షటిల్ కోర్టు

రావికమతం: కొత్తకోటలో సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా స్థాయి షటిల్ పోటీలను నిర్వహించనున్నారు. ఇందుకుగానూ ఇండోర్ స్థాయిలో ఉండేలా ప్రత్యేకమైన షటిల్ కోర్టు తయారు చేస్తున్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేసి నగదు బహుమతులు అందిస్తామని యూత్ సభ్యులు తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లు నమోదుకు 73966 69229, 95503 21320, 91776 66960 నంబర్లను సంప్రదించాలని కోరారు. వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇక్కడ 30 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

2న మెగా రక్తదాన శిబిరం


గోడపత్రిక విడుదల చేస్తున్న సీఐ మహమ్మద్

రావికమతం: గాంధీ జయంతి సందర్భంగా వచ్చే నెల 2న కొత్తకోటలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ శుక్రవారం గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండి ఆరోగ్యంగా ఉన్నవారంతా రక్తం దానం చేయాలన్నారు. రక్తదానం మరొకరికి ప్రాణ దానం చేసినట్లేనని చెప్పారు. నర్సీపట్నం తాసుబిల్లి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నారు. కొత్తకోట ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరోగ్యం

- నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం
- ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలి
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


తామరం సచివాలయం వద్ద వైద్యాధికారితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి దేవి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ ఆరోగ్యాన్ని అందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఈ నెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నారని, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతోపాటు ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వెలుగు సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మనిషికి ముఖ్యంగా కావాల్సింది వైద్యం, విద్య అన్నారు. ఆ రెండింటి పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఆయా రంగాల్లో సమూలమైన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఎల్‌కేజీ నుంచి విదేశీ విద్య వరకూ రాయితీలు కల్పించడమే కాక ఇంటర్ వరకూ పోషకాహారం అందజేస్తున్నారన్నారు. వైద్య శాఖలో జీరో వేకెన్సీ పద్ధతిలో దేశంలోనే ఆదర్శంగా భర్తీలు చేస్తున్నారన్నారు. పది రోజులుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి ఏ ఇంట్లో ఎవ్వరెవ్వరికీ ఏ విధమైన సమస్యలున్నాయో గుర్తించారన్నారు. వీరందరికీ ఈ నెల 30 నుంచి ప్రత్యేక వైద్య నిపుణులను గ్రామాలకే తీసుకువచ్చి వైద్య సహాయమందించే గొప్ప కార్యక్రమం' జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా సాధ్యం చేస్తున్నారన్నారు. రూ.177 కోట్ల రుణమున్న చోడవరం సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వ సహకారంతో రూ.4 కోట్లకు తగ్గించుకున్నామన్నారు. గత ప్రభుత్వాలు ఫ్యాక్టరీకి అప్పుగా సహాయం చేస్తే సీఎం జగన్‌మోహనరెడ్డి రూ.12.5 కోట్లు గ్రాంటుగా ఇచ్చారన్నారు. రైతులకు ఇది పెద్ద శుభవార్త అన్నారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు శాఖల అధికారుల ఆయా శాఖల పనితీరు గురించి వివరించారు. పీఎం కిసాన్ వర్తించాలంటే రైతులంతా ఈ నెల 30లోగా ఈ– పంట నమోదు చేసుకోవాలని ఏవో జయలక్ష్మి తెలిపారు. కొత్తకోటలో ఇంటింటి కుళాయి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీటీసీ పూడి దేవా సభ దృష్టికి తెచ్చారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువుల బస్తా రూ.250 ఉంటే, ప్రైవేటు దుకాణాల్లో రూ.350కి విక్రయిస్తున్నారని ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకురాగా, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్, దంట్ల వెంకటరమణ, తహసీల్దార్ మహేస్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష

మాకవరపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రత్యేకాధికారి డాక్టర్ దేవి వైద్య సిబ్బందికి సూచించారు. మాకవరపాలెం పీహెచ్‌సీని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవిద్య, ఇతర సిబ్బందితో సమీక్షించారు. శనివారం తామరంలో మొదటగా జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఎంత మంది సిబ్బందిని నియమించారనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం తామరం సచివాలయం వద్ద శిబిరం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా శిబిరాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. సీహెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలో శనివారం నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నామని ఎంపీడీవో జయప్రకాష్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం అప్పలరాజుపురంలో ఈ శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ ప్రారంభిస్తారన్నారు. చీడికాడ, పెదగోగాడ పీహెచ్‌సీ పరిధిలో 14 రకాల వ్యాధులకు సంబంధించి రోగులను పరీక్షిస్తారన్నారు.

నేడు మాడుగుల గెడ్డ బడిలో..

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం మాడుగుల ఆరోగ్య ఉప కేంద్రం -2 పరిధిలో శనివారం ఏర్పాటు చేస్తున్నట్లు కె.జె.పురం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాద్‌పాత్రుడు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరం మాడుగుల గెడ్డ బడిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

రోలుగుంటలో భారీ వర్షం


రోలుగుంటలో కురుస్తున్న వర్షం

రోలుగుంట: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో వ్యవసాయశాఖ రాయితీపై వరి విత్తనాలు జూలైలో సరఫరా చేయడం, ఆ సమయంలోనే వర్షాలు పడటంతో నారుమడుల్లో ఆకుపోత పనులు చేపట్టారు. తర్వాత సాగు వసతి కలిగిన భూముల్లో నాట్లు పడ్డాయి. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో నీటి ఇంజిన్లతో తడుపులు పెట్టి భూములు ఆరకుండా మండల రైతాంగం సంరక్షించుకుంది. రెండు వారాలుగా ఎండలు కాయడం, పొలాల్లో కలుపు మొక్కలు పెరిగిపోవడంతో ఇంజిన్లతో పొలాలకు తడులు వేసుకునేందుకు సిద్ధపడుతున్న తరుణంలో గురు, శుక్రవారాలు రోలుగుంట, కంచుగుమల, కొంతలం, వెలంకాయలపాలెం తదితర గ్రామాల్లో భారీ వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా కాస్తున్న ఎండలకు వరినాట్లు ఎండిపోతున్నాయి. ఈ సమయంలో కురిసిన వర్షం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉందని రైతులు చెబుతున్నారు. గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది.

గొలుగొండ: మండలంలో చోద్యం, లింగంపేట, జోగుంపేట, గొలుగొండ, చంద్రయ్యపాలెం, అమ్మపేట, శ్రీరాంపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గంట పాటు వర్షం కురిసింది. దీనివల్ల రైతులకు ఎంతో ఊరట వచ్చింది. మెరక ప్రాంతాల్లో మేలు చేసిందని చెబుతున్నారు. వర్షం కారణంగా దారగెడ్డ, బోరింగ్‌గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహించి తాండవ జలాశయానికి చేరుతుంది.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం


ఏకా శివ ప్రసాద్ | ఎస్‌వీవీ సత్యనారాయణ | రుత్తల శ్రీనివాస్ | లెక్కల సత్యనారాయణ | లగుడు నాగేశ్వరరావు


తాళ్లపురెడ్డి వెంకటరాజారాం | గొల్లవిల్లి రాజబాబు | బూరె బాబూరావు | రెడ్డి జగన్‌మోహన్ | కోరుకొండ అప్పలనాయుడు


గుమ్ముడు సత్యదేవ్ | దొడ్డి వెంకటేశ్వరరావు | గొర్ల వెంకటరమణ

నర్సీపట్నం/మాడుగుల/చోడవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా మండలాధ్యక్షులు

- నర్సీపట్నం నియోజకవర్గంలో మండలాధ్యక్షులుగా ఎస్‌వీవీ సత్యనారాయణ(నర్సీపట్నం రూరల్), రుత్తల శ్రీనివాస్(మాకవరపాలెం), లెక్కల సత్యనారాయణ(గొలుగొండ), లగుడు నాగేశ్వరరావు(నాతవరం), ఏకా శివప్రసాద్(నర్సీపట్నం మున్సిపాలిటీ) నియామకమయ్యారు.
- మాడుగుల నియోజకవర్గంలో మండలాధ్యక్షులుగా బూరె బాబూరావు(దేవరాపల్లి), రెడ్డి జగన్‌మోహన్(కె.కోటపాడు), గొల్లవిల్లి రాజబాబు(చీడికాడ), తాళ్లపురెడ్డి వెంకటరాజారాం(మాడుగుల)లను నియమించారు.
- చోడవరం నియోజకవర్గంలో మండలాధ్యక్షులుగా గొర్ల వెంకటరమణ(రోలుగుంట), దొడ్డి వెంకటేశ్వరరావు(చోడవరం), గుమ్ముడు సత్యదేవ్(రావికమతం), కోరుకొండ అప్పలనాయుడు(బుచ్చెయ్యపేట) నియమితులయ్యారు.

చెరకు టన్నుకు రూ.4 వేలు చెల్లించాలి

ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్

చోడవరం రూరల్: చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి రైతులు సరఫరా చేసే చెరకు టన్నుకు రూ.4 వేల మద్దతు ధర చెల్లించాలని ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఫ్యాక్టరీ సర్వజన సభలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.జగదీశ్వరరావు కరపత్రాలను పంచిపెట్టారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు కారణంగా చెరకు సాగు విస్తీర్ణం దారుణంగా తగ్గిపోయిందని, దీనిని ప్రోత్సహించడంలో భాగంగా మద్దతు ధర పెంచడంతోపాటు, చెరకు విత్తనం, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఫ్యాక్టరీ మనుగడకు రూ.100 కోట్ల గ్రాంటు విడుదల చేయాలన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



రావికమతం: కొత్తకోటలో దుర్గాదేవి ఆలయ అర్చకుడు వేపా రామకృష్ణ కిషోర్ ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున బ్రహ్మకమలం వికసించింది. ఆయన కడియం నర్సరీ నుంచి మొక్కను తీసుకొచ్చి ఏడాది క్రితం తెచ్చి ఇంట్లో వేశారు. తాజాగా పుష్పం వికసించి సువాసన వెలువడంతో కుటుంబం సమేతంగా పూజలు చేసి పుష్పాన్ని దేవునికి సమర్పించారు.

6న మాకవరపాలెంలో జగనన్నకు చెబుదాం

మాకవరపాలెం: మండల పరిషత్ సమావేశ మందిరంలో వచ్చే నెల 6న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు వినతుల ద్వారా తెలియజేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు కొరువాడ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం కమలాకుమారి, పీడీ దేముళ్లు

కె.కోటపాడు: అండర్–17 కబడ్డీ జిల్లా జట్టుకు కొరువాడ హైస్కూల్ విద్యార్థి సిహెచ్.రామారావు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న మాకవరపాలెంలో జరిగిన కబడ్డీ పోటీల్లో రామారావు ప్రతిభ చూపి జిల్లా కబడ్డీ జట్టులో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. జిల్లా జట్టు తరపున త్వరలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థి రామారావును ప్రధానోపాధ్యాయిని కమలాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ దేముళ్లు శుక్రవారం అభినందించారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం


పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు

కె.కోటపాడు: చిరికివానిపాలెం గ్రామస్తులు వినాయక అనుపు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడి రామాలయంలో వినాయక విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఉప సర్పంచ్ చిరికి గోవింద, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయ గోపురం పనులు ప్రారంభం


గోపురం పనులకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: కొంతలంలో గ్రామస్తులు ఐక్యంగా చేపట్టిన నూకాంబిక ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం గోపురం పనులు చేపట్టారు. ఇక్కడ ఆచార సంప్రదాయాల ప్రకారం పసుపుకుంకుమ, ధాన్యంతో పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి ఆలయ నిర్మాణం దిగ్విజయంగా పూర్తి కావాలని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పాండిపంటలను బాగా పండాలని వేడుకున్నారు.

గవరవరంలో నామట్టి-నాదేశం


ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం

చోడవరం రూరల్: గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'నామట్టి–నాదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా దేశ సంస్కృతీ సంప్రదాయాలను వెల్లడించే రీతిలో విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని వడ్డాది మెయిన్ స్కూల్ హెచ్‌ఎం టి.వి. శేషగిరి రావు తెలిపారు. శుక్రవారం నా భూమి – నా దేశం సందేశంపై పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పూర్వ కాలం నుంచి తరతరాలుగా వస్తున్న భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించి వాటి ప్రాధాన్యం గురించి తెలుసుకుని ఆచరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య రక్ష, సూక్తి ముక్తావళిపై అవగాహన కల్పించారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి సహకరించాలని వినతి


డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావుతో సహకార సంఘాల అధ్యక్షులు

మాడుగుల రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు) పురోభివృద్ధికి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డి.సి.ఎం.ఎస్) సహకరించాలని మండలంలోని సహకార సంఘాల అధ్యక్షులు శుక్రవారం అనకాపల్లిలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావును కలిశారు. ప్రధానంగా డి.సి.ఎం.ఎస్ పరిధిలోని స్థలాలను సహకార సంఘాలకు ఇవ్వాలని, వాటిల్లో షాపులు ఏర్పాటు చేసుకుంటే తద్వారా ఆర్థికంగా బలోపేతం కానున్నాయని కోరారు. సహకార సంఘాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్(ఎం. కోడూరు), కోరుకొండ చెల్లంనాయుడు (వీరవల్లి అగ్రహారం), కాళ్ల రాము(కె.జె.పురం), బొద్దాపు భాస్కరరావు(ఒమ్మలి)తోపాటు డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి, మాడుగుల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కుంగిన గుండాలవాని చెరువు మదుము

మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ఎ.భీమవరం గ్రామస్తులు


కూలిన మదుము ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శేషు, రమణ

కె.కోటపాడు: ఎ.భీమవరంలో గుండాల వాని చెరువు మదుము ఇటీవల వర్షాలకు కుంగిపోయింది. మదుము కుంగిపోవడంతో చెరువు గట్టు కోతకు గురయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గట్టు కోతకు గురయితే 150 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తర్రా శేషు తెలిపారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు కూలిన మదుమును పరిశీలించి, మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. శుక్రవారం ఆయనతోపాటు నీటి సంఘం డైరెక్టర్ తర్రా మహేశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు తాడి రమణ, పీఎంసీ కమిటీ వైస్ చైర్మన్ తర్రా మోహన్‌రావు, చందు పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

మాకవరపాలెం: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని మాకవరపాలెం పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి సుదర్శనరావు కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు


అన్నసమారాధనలో వడ్డిస్తున్న యూత్


కె.జె.పురంలో అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు


రావికమతం: గట్రెడ్డివారి రామ మందిరం వద్ద అన్నసమారాధన

మాకవరపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజారావుపేటలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. 11 రోజులుగా ఇక్కడి మండపంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏటా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఇక్కడ భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధనకు వేలాదిగా భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. వీధి పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కె.జె.పురం నెహ్రూ వీధిలో గణనాథుని వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక మదర్ థెరిసా టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 14 రకాల వంటకాలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి గణనాథుడి విగ్రహాన్ని ఘనంగా నిమజ్జనం చేశారు.

నేడు గాంధీవీధిలో

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కె.జె.పురం గాంధీ వీధిలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రావికమతం: వినాయక నిమజ్జనోత్సవాలు సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. కొత్తకోట గట్రెడ్డి వారి రామ మందిరం వద్ద, కొత్తకోట గాంధీనగర్‌లో, దొండపూడి మజ్జి వీధిలో, ఎల్ఎస్ పురంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

నేడు తట్టబందలో జగనన్న ఆరోగ్య సురక్ష

రావికమతం: తట్టబంద గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు శుక్రవారం తెలిపారు. వైద్య బృందంతోపాటు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారన్నారు.

విద్యుత్తు కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం

నర్సీపట్నం: విద్యుత్ కనెక్షన్‌కు వినియోగదారులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్స్ జోన్–2 బి.కె.నాయుడు తెలిపారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. ఇళ్లకు వచ్చిన విద్యుత్ సిబ్బందికి తమ ఆధార్ నకలు ఇచ్చి సహకరించాలని సూచించారు.